క్లుప్తంగా

పశు సంచారాన్ని నియంత్రించరూ..



రోడ్లపై తిరుగుతున్న పశువులు

పెద్దాపురం: నిత్యం రద్దీగా ఉండే రహదారులపై పశువులు సంచరిస్తూ వాహన చోదకులకు ఇబ్బందిగా మారుతున్నాయి. పట్టణానికి చేరుకునే జగ్గంపేట రహదారి, రాయభూపాలపట్నం నుంచి పట్టణానికి వచ్చే రోడ్డు, వడ్లమూరు రోడ్డులో ఈ పరిస్థితి ఎక్కువగా ఉంది. ప్రభుత్వ కార్యాలయాల్లో పెరిగే పిచ్చితుప్పలు, పచ్చగడ్డి, రహదారులను ఆనుకుని ఉన్న పోస్టర్లను తింటూ పొట్ట నింపుకొంటున్నాయి ఆ మూగజీవాలు. అధికారులు స్పందించి వాటిని బందిల దొడ్డికి పంపి, యజమానులకు జరిమానా విధించాలని పాదచారులు, వాహన చోదకులు కోరుతున్నారు.

ఫోర్జరీ సంతకాలపై ఫిర్యాదు

సామర్లకోట: ఫోర్జరీ సంతకాలతో తప్పుడు అగ్రిమెంట్ సృష్టించారని పోకల ఝాన్సీదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ కె దుర్గాప్రసాద్ ఆదివారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్ శివప్రసాద్ ఫోర్జరీ సంతకాలు కలిగిన తప్పుడు అగ్రిమెంటు సృష్టించినట్లు ఝాన్సీదేవి ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. దాంతో శివప్రసాద్‌తో పాటు అతనికి సహకరించిన వి.శ్రీప్రకాష్‌లపై కేసు నమోదు చేశామన్నారు. ఇంటిని కొనడానికి రూ.36 లక్షలు ఫిర్యాదికి ఇచ్చినట్లు అగ్రిమెంట్ సృష్టించారని తెలిపారు.

అంజలీదేవి నటనా కౌశలం అపూర్వం



అంజలీదేవి విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

పెద్దాపురం: నటనా కౌశలంతో యావత్ ప్రజానీకాన్ని మెప్పించిన నటి అంజలిదేవి అని పెద్దాపురం జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి తుమ్మల బాబు, ప్రముఖ పారిశ్రామిక వేత్త గోలి రామారావు అన్నారు. పట్టణ ఆడపడుచు అంజలీదేవి ఎనిమిదో వర్ధంతిని ఆదివారం రాత్రి నిర్వహించారు. పాలమరశెట్టి సత్తిబాబు అధ్యక్షతన జరిగిన సభలో ఆ వార్డు కౌన్సిలర్ విజ్జపు రాజశేఖర్, అంజలీదేవి మేనల్లుడు గోర్ల బాబి, గోర్ల శ్రీను తదితరులు మాట్లాడుతూ అభిమానుల గుండెల్లో ఆమె చెరగని ముద్ర వేశారన్నారు. తొలుత అంజలీదేవి విగ్రహానికి క్షీరాభిషేకం చేసి నివాళులర్పించారు. కౌన్సిలర్ గోర్ల విజయలక్ష్మి, అంజలీదేవి కుటుంబ సభ్యులు, అభిమానులు, కళాకారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఉప్పాడలో రచ్చబండ

కొత్తపల్లి: మండలంలోని ఉప్పాడలో మాజీ ఎమ్మెల్యే వర్మ ఆదివారం రచ్చబండ నిర్వహించారు. మత్స్యకారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డీజిల్ సబ్సిడీ ఇవ్వాలన్నారు. మండల టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

నరసింహయ్య ఆశయాలు కొనసాగించాలి



నరసింహయ్య సంతాప సభలో ప్రసంగిస్తున్న కర్నాకుల వీరాంజనేయులు

ప్రత్తిపాడు: సీపీఐ (ఎంఎల్) జనశక్తి రాష్ట్ర కార్యదర్శి నంబి నరసింహయ్య ఆశయాలను కొనసాగించాలని ఏపీ రైతుకూలీ సంఘం (ఏపీఆర్‌సీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల ఆంజనేయులు పిలుపు నిచ్చారు. మండలంలోని పులిమేరు శివారు దమ్‌పేటలో ఆదివారం నరసియ్య సంతాప సభ జరిగింది. ఈ సందర్భంగా వీరాంజనేయులు మాట్లాడుతూ నరసింహయ్య మరణం విప్లవోద్యమానికి తీరని లోటని అన్నారు. భూమి, భుక్తి, విముక్తి, ప్రజల హక్కుల కోసం సాగిన అనేక ఉద్యమాల్లో ఆయన కీలకంగా వ్యవహించారని కొనియాడారు. రైతుకూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రమేష్ అధ్యక్షతన జరిగిన సభలో జిల్లా అధ్యక్షుడు వల్లూరి రాజబాబు, సంఘ నాయకులు బాబూరావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆసక్తిగా అష్టావధానం

కాకినాడ కల్చరల్: స్థానిక విద్యుత్‌నగర్‌లోని చల్లా కల్యాణమండపంలో ఆదివారం ఉదయం అస్వాదన సమితి ఆధ్వర్యంలో విశ్రాంత తెలుగు ఉపాధ్యాయులు కాకరపర్తి దుర్గాప్రసాద్ అష్టావధానం జరిగింది. అష్టావధానం ఆద్యంతం ఆసక్తిగా జరిగింది. ప్రముఖ శతావధాని డాక్టర్ పోచినపెద్ది సుబ్రహ్మణ్యం నిషిద్ధాక్షరి, కవి కొరుప్రోలు గౌరినాయుడు అప్రస్తుత ప్రసంగం చేశారు. ఆ కార్యక్రమంలో డాక్టర్ బలుసు అపర్ణ, పోతరాజు, జోస్యుల కృష్ణబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యానానికి తోట బడి

- రైతులకు ప్రతివారం పాఠాలు
- తక్కువ వ్యయంతో అధికాదాయం
- నష్టపోకుండా తోడ్పడుతున్న ప్రభుత్వం



ఆర్‌బీ పట్నంలో దుంప రైతులకు అవగాహన కల్పిస్తున్న వీహెచ్‌ఏ

పెద్దాపురం: ఇప్పటి వరకు వరి, అపరాల సాగుకు సంబంధించి రైతులను ప్రోత్సహిస్తూ వారికి మెళకువలు చెప్తూ పొలంబడి నిర్వహించేవారు. నేడు ప్రభుత్వం ఉద్యాన పంటలపైనా దృష్టిపెట్టి అందులో అధిక ఉత్పత్తులు సాధించేందుకు రైతులకు తోటబడి నిర్వహిస్తూ ఆ సాగును ప్రోత్సహిస్తోంది. మామిడి తోటల్లో కొమ్మ కత్తిరింపు, ఎరువుల వాడకం, యాజమాన్య పద్ధతులు, చీడపీడల నివారణపై అవగాహన కల్పిస్తున్నారు.

ప్రయోగాత్మకంగా..

తోటబడిలో రైతుల సందేహాలు నివృత్తి చేయడంతో పాటు తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం వచ్చే పద్ధతులను ప్రయోగాత్మకంగా వివరిస్తున్నారు. ఎరువులు, పురుగు మందులు వినియోగించకుండా ప్రకృతి విధానంలో తీసుకోవాల్సిన చర్యలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

సబ్ డివిజన్‌లో 12 వేల ఎకరాల్లో..

పెద్దాపురం వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో సుమారు 12 వేల ఎకరాల్లో ఉద్యాన పంటలు పండిస్తున్నారు. పెద్దాపురం మండలంలో మెట్ట గ్రామాల్లో సుమారు 5 వేల ఎకరాలు, రంగంపేటలో 6,500 ఎకరాలు, సామర్లకోటలో 500 ఎకరాల్లో ఉద్యాన పంటలు పండిస్తున్నారు.

ఉద్యాన పంటల రక్షణకు..



రైతులకు పొలంబడి మాదిరిగానే ఉద్యాన పంటల రక్షణకు తోటబడి ఎంతో ఉపయుక్తం. ఈ పంటలపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఉద్యాన పంటలు ఎక్కువగా సాగు చేసే ప్రాంతాల్లో ప్రతి శుక్రవారం తోటబడి నిర్వహిస్తున్నాం.

-ఎస్.సుజాత, ఉద్యాన శాఖాధికారి, పెద్దాపురం

నగర పంచాయతీ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- గొల్లప్రోలులో గడప గడపకు మన ప్రభుత్వం



గొల్లప్రోలులో ఒక ఇంటి వద్ద చిన్నారితో ముచ్చటిస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

పిఠాపురం: నియోజకవర్గ నగర పంచాయతీ, మున్సిపాలిటీలలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు ఎమ్మెల్యే పెండెం దొరబాబు తెలిపారు. గొల్లప్రోలులో ఆదివారం నాలుగో వార్డు సచివాలయ పరిధిలో 10, 12 వార్డుల్లో ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహించారు. అధికారులు ప్రజాప్రతినిధులతో కలసి ప్రతీ ఇంటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా అని లబ్ధిదారులను పలకరించారు. ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ గొల్లప్రోలు నగర పంచాయతీ, పిఠాపురం మున్సిపాలిటీలలో రూ 40 కోట్ల వ్యయంతో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతున్నామన్నారు. గత ఏడాది కాపు నేస్తం ప్రారంభానికి గొల్లప్రోలు వచ్చిన సీఎం జగన్ గొల్లప్రోలు నగర పంచాయతీకి రూ.20 కోట్లు, పిఠాపురం మున్సిపాలిటీకి రూ.20 కోట్లు ప్రత్యేక నిధులు కేటాయించారన్నారు. వీటితో అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించామని ఆయన తెలిపారు. ప్రతి పక్షాలు గ్రామాల్లో అడుగు పెట్టే అర్హత లేక ప్రభుత్వ పథకాలపై తప్పుడు ప్రచారాలకు దిగుతున్నారన్నారు. నేడు ఎటువంటి పైరవీలు, రాజకీయాలు లేకుండా నేరుగా లబ్ధిదారులకు పథకాలు అందేలా చేసి అవినీతికి తావు లేకుండా చేశారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో మౌలిక వసతుల కల్పన

కొత్తపల్లి: జగనన్న కాలనీల్లో ప్రభుత్వం మౌలిక వసతుల ఏర్పాటు వేగంగా చేపడుతోందని ఎంపీపీ కారే సుధ అన్నారు. మండలంలోని పొన్నాడ శివారు కోనపాపపేటలో ప్రభుత్వ కాలనీల్లో జరుగుతున్నా ఇళ్ల నిర్మాణ పనులను ఆదివారం పరిశీలించారు. ఇళ్ల నిర్మాణాలను లబ్ధిదారులు త్వరగా చేపట్టాలన్నారు.

విపత్తు వేళ రక్షణ ఇలా..



నీటిలో మునిగిపోతున్న వారిని రక్షించే విధానాన్ని చూపిస్తున్న ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది



అగ్నిప్రమాదాల సమయంలో తీసుకోవలసిన చర్యలను వివరిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ఆపదమిత్రలకు ఎస్‌డీఆర్‌ఎఫ్ శిక్షణ

సామర్లకోట: వరదల్లో చిక్కుకున్న వారిని ఎలా రక్షించాలో ఆపద మిత్రలకు ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది ప్రయోగాత్మకంగా వివరించారు. ఫీల్డ్ విజిట్‌లో భాగంగా కాకినాడ, తూర్పుగోదావరి జిలాల్లకు చెందిన 113 మంది ఆపద మిత్రలకు ఇస్తున్న శిక్షణలో భాగంగా ఆదివారం పెద్దాపురం మండలం జి.రాగంపేట పంచాయతీ చెరువులో ప్రమాదవశాత్తు మునిగిపోతున్న వాళ్లని ఎలా రక్షించాలో ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం చేసి చూపారు. తుపాను, వరదల సమయాల్లో స్పందించాల్సిన పద్ధతులు, ప్రథమ చికిత్సలపై అవగాహన కల్పించారు. జి.రాగంపేట సర్పంచ్ బుంగా శేఖర్‌బాబు సహకారంతో స్వచ్ఛభారత్‌పై అవగాహన కల్పించారు. తుపాన్, వరదల సమయాల్లో మత్స్యశాఖ సహకారం అవసరం ఉంటుందని, దీనిని దృష్టిలో ఉంచుకుని ఆయా శాఖ అధికారులకు వెంటనే ఆపద సమాచారం ఇవ్వాలని విపత్తుల నివారణ సంస్థ జిల్లా మేనేజర్ కిరణ్మయి తెలిపారు. సోమవారంతో ఆపద మిత్రల శిక్షణ ముగుస్తుంది. ఎస్‌డీఆర్‌ఎఫ్ ప్రతినిధి హరాచంద్ కుమార్, ఈటీసీ ఫ్యాకల్టీలు పి.శ్రీనివాసరావు, ఎంఎస్ఎన్ రెడ్డి, నిహారిక, వి.ప్రసాద్, బి.ఆంజనేయులు పాల్గొన్నారు. ఫీల్డ్ విజిట్ అనంతరం ఆపదమిత్రలకు రాత పరీక్ష నిర్వహించారు.

ఉత్సాహంగా సూర్య నమస్కారాల పోటీలు



యోగాసనాలు వేస్తున్న దృశ్యం



సూర్యనమస్కారాల పోటీలో పాల్గొన్న విద్యార్థులు

పిఠాపురం: పిఠాపురం ఆర్‌ఆర్‌బీహెచ్‌ఆర్ హైస్కూలు ఆటస్థలంలో రథసప్తమిని పురస్కరించుకుని ఆర్‌ఎస్ఎస్ ఆధ్వర్యంలో సామూహిక సూర్య నమస్కారాల పోటీ నిర్వహించారు. పోటీకి 15 పాఠశాలలకు చెందిన 228 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని సూర్యనమస్కారాలు చేశారు. ఆర్‌ఎస్ఎస్ నాయకులు గట్టి అశోక్, మురాలశెట్టి సునీల్, రవి శంకర్ విజేతలకు బహుమతులు అందజేశారు. ఆర్‌ఎస్ఎస్ నాయకులు పెమ్మరాజు సత్యరామచంద్రరావు, శ్రీనివాస్, శంకర్, వీరభద్రరావు, సత్యమోహన్, యోగా శ్రీనివాస్, పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

కొత్తపల్లిలో..

కొత్తపల్లి: మండలంలోని నాగులపల్లి ఉమారామలింగేశ్వర ఆలయం వద్ద ఆదివారం సేవా భారతి రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో సూర్య నమస్కార పోటీలు నిర్వహించారు. రథసప్తమి సందర్భంగా నిర్వహించిన ఈ పోటీలకు ఆర్‌ఎస్ఎస్ అధ్యక్షుడు సుబ్బారావు హాజరయ్యారు. పోటీల్లో పాల్గొన్నవారికి సీనియర్, జూనియర్ విభాగాల్లో బహుమతులను అందించారు. రామేశ్వరరెడ్డి, రాజు, శ్రీనువాస్‌రెడ్డి పాల్గొన్నారు.

భావనారాయణుని దర్శనానికి పోటెత్తిన భక్తులు

- భక్తుల ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే కన్నబాబు
- నిత్యాన్నదానానికి చర్యలు తీసుకుంటామని వెల్లడి



సర్పవరం ఆలయంలో భక్తులకు సౌకర్యాలు తెలుసుకుని వారికి అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

కాకినాడ రూరల్: మాఘ మాసం వచ్చిందంటే సర్పవరం గ్రామానికి తిరునాళ్లు వచ్చినట్టే. ప్రసిద్ధిగాంచిన రాజ్యలక్ష్మి సమేత భావనారాయణ స్వామి ఆలయానికి ఈ మాసంలో వేలాదిగా భక్తులు తరలి వస్తారు. స్వామివారిని సూర్యుని ప్రతిరూపంగా భావించి ఆవుపాలతో పొంగలి తయారు చేసి నైవేద్యంగా సమర్పిస్తారు. తెల్లవారు జామునుంచే మహిళలు పొంగలి తయారు చేస్తూ కనిపించారు. ఆలయ ఈవో విజయలక్ష్మి ఆధ్వర్యంలో సిబ్బందితో పాటు ఆలయ పాలకమండలి చైర్మన్ పుల్ల నారాయణరావు, సభ్యులు భక్తులకు ఏర్పాట్లు చేశారు. భక్తులకు క్యూ లైన్లు ఏర్పాటుతో పాటు దర్శనానంతరం అన్న ప్రసాదం ఏర్పాటు చేశారు. గ్రామస్తులు సహకారంతో ఏర్పాటు చేసిన అన్న ప్రసాదం అందరికి అందేలా పుల్ల చందు, సర్పంచ్ శీలం చిన్న, ఉప సర్పంచ్ పుల్ల ప్రభాకరరావు, చక్రధర్ తదితరులు వడ్డన చేశారు. ఎమ్మెల్యే కురసాల కన్నబాబు స్వయంగా ఏర్పాట్లు పరిశీలించి అక్కడి సౌకర్యాలను భక్తులను అడిగి తెలుసుకున్నారు. భక్తులకు ఆయన అన్నప్రసాదం వడ్డించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ స్వామివారి ఆలయాన్ని నారదుడు ప్రతిష్ఠించినట్లు ప్రతీతి అని, ఈ ఆలయానికి పిఠాపురం వచ్చే మహారాష్ట్ర భక్తులు ఇటీవల కాలంలో ఇక్కడకు వస్తున్నారని, వారి కోసం హిందీలో బోర్డులను ఏర్పాటు చేయాలని ఆదేశించామన్నారు. ఆలయాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని అన్నారు. నిత్యాన్నదానం ఏర్పాటు చేయాలన్నది తన ఆకాంక్ష అని, దానికి తగ్గట్టు ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు.



సర్పవరం ఆలయంలో క్యూలో దర్శనాల కోసం వేచి ఉన్న భక్తులు

నాటి గిల్లికజ్జాలే నేటి స్నేహ మాధుర్యాలు..



సామర్లకోట ప్రభుత్వ హైస్కూల్‌లో కలుసుకున్న 1975-76 బ్యాచ్ విద్యార్థులు

- ప్రభుత్వ పాఠశాలలో సందడి చేసిన 1975-76 బ్యాచ్ విద్యార్థులు
- పూర్వ విద్యార్థుల ట్రస్ట్ ఏర్పాటు

సామర్లకోట: స్థానిక ప్రభుత్వ హైస్కూల్‌లో 1975-76 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం సమావేశమయ్యారు. విశ్రాంత హెచ్‌ఎం యండ్రు ప్రభాకర రావు, కౌన్సిలర్ స్వయంభారపు వీరభద్రరావు, అడపా వెంకట్రావుల సహకారంతో రెండు రోజుల వ్యవధిలో వారందరినీ సమీకరించడంతో ఆ నాటి విద్యార్థులందరూ హర్షం వ్యక్తం చేశారు. స్థానిక నీలమ్మ చెరువు గట్టుపై ఉన్న లయన్స్ క్లబ్ భవనంలో వారంతా సమావేశమై నాటి ముచ్చట్లలో మునిగితేలారు. అమెరికాలో ఉంటున్న ఇద్దరు పూర్వ విద్యార్థులు సామర్లకోట రావడంతో ఈ కార్యక్రమం ఏర్పాటు చేయాలనే ఆలోచన కలిగిందని సమావేశానికి అధ్యక్షత వహించిన యండ్రు ప్రభాకరరావు తెలిపారు. 55 మంది విద్యార్థులు తమను తాము పరిచయం చేసుకుంటూ 47 ఏళ్ల గత జ్ఞాపకాలను గుర్తు చేసుకుని నాటి అల్లరి పనులు, గిల్లికజ్జాలు గుర్తు చేసుకుని సందడి చేశారు. పలువురు ఆనందం తట్టుకోలేక బాల్య స్నేహితులను కలుసుకున్న సంతోషంతో చెమ్మగిల్లిన కళ్లతో నాటి రోజులకు వెళ్లిపోయారు. పూర్వ విద్యార్థులు ఒక ట్రస్టు ఏర్పాటు చేసి సహాయ కార్యక్రమాలు నిర్వహించాలని యార్లగడ్డ వీర వెంకట్రావు, మాసిన ప్రసాద్ సూచించగా ఆ మేరకు ట్రస్టు ఏర్పాటుకు ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షునిగా యండ్రు ప్రభాకరరావు, ప్రధాన కార్యదర్శిగా అడపా వెంకట్రావు, కోశాధికారి స్వయంభారపు వీరభద్రరావు, ఉపాధ్యక్షులుగా ఆర్‌డీడీవీ ప్రసాద్, పాలకుర్తి ప్రసాద్, సహాయ కార్యదర్శులుగా యు.రామారావు, యార్లగడ్డ వెంకట్రావు, సతీష్ ఎన్నికయ్యారు.

ఉత్సాహంగా బేస్‌బాల్ పోటీలు



ఎస్‌జీఎఫ్‌ఐ బేస్‌బాల్ ఆడుతున్న క్రీడాకారులు

నాగమల్లితోట జంక్షన్: పాఠశాల క్రీడాసమాఖ్య అండర్-14, 17 ఆధ్వర్యంలో స్థానిక పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో జరుగుతున్న రాష్ట్రస్థాయి అంతర్ జిల్లాల ఎస్‌జీఎఫ్‌ఐ బేస్‌బాల్ పోటీలు ఆదివారం ఉత్సాహంగా జరిగాయి. అండర్-14, 17 బాలుర, బాలికల విభాగంలో నిర్వహించిన మ్యాచ్‌లను ఎస్‌జీఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ప్రసాద్ పర్యవేక్షించారు. అండర్-17 బాలుర విభాగంలో కర్నూల్, గుంటూరు, శ్రీకాకుళం, ప్రకాశం జట్లు క్వాటర్ ఫైనల్స్‌కు చేరుకున్నాయి. బాలికల విభాగంలో కడప, ప్రకాశం, విజయనగరం, శ్రీకాకుళం జట్లు క్వార్టర్స్ దశకు వచ్చాయి. మ్యాచ్‌ల నిర్వహణలో సీనియర్ పీడీలు బంగార్రాజు, రంగారావు, గిరి, పట్టాభి, శ్రీను, స్వామి, వెంకటేశ్వరరావు, శిరీష సహకారం అందించారు.

నియామకాలు చేపట్టాలి

కాకినాడ సిటీ: ఉపాధ్యాయుల నియామకం చేపట్టాలని యూటీఎఫ్ జిల్లా నేతలు డిమాండ్ చేశారు. ఆదివారం కచేరీపేట యూటీఎఫ్ కార్యాలయంలో రాష్ట్ర కార్యదర్శి జి.ప్రభాకరవర్మ, జిల్లా అధ్యక్షుడు కేవీవీ నగేష్, ప్రధాన కార్యదర్శి టి రవిచక్రవర్తి, అసోసియేట్ అధ్యక్షుడు ఐ ప్రసాదరావు విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సరెండర్ లీవ్, డీఏలు, ఏపీజీఎల్ఐ తదితర ఆర్థిక బకాయిలు చెల్లించాలని, సీపీఎస్ రద్దు చేయాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా శాఖ రూపొందించిన 2023 క్యాలెండర్‌ను వారు ఆదివారం ఆవిష్కరించారు.

నేడు కాంట్రాక్టు కమిటీ సమావేశం

సామర్లకోట: మున్సిపల్ కాంట్రాక్టు కమిటీ సమావేశం సోమవారం ఉదయం 11 గంటలకు జరుగుతుందని చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తన చాంబర్‌లో జరిగే సమావేశానికి వైస్ చైర్మన్‌లతో పాటు కాంట్రాక్టు కమిటీ సభ్యులు, కాంట్రాక్టర్లు హాజరు కావాలన్నారు.

తూర్పున గట్టి బేస్

- రాణిస్తున్న క్రీడాకారులు
- గ్రామీణంలో పెరుగుతున్న ఆదరణ
- జిల్లాలో 700 మంది క్రీడాకారులకు శిక్షణ
- పోలీస్, ఎయిర్‌ఫోర్స్ ఉద్యోగాలకు అవకాశం




బేస్‌బాల్ ఆడుతున్న క్రీడాకారులు

నాగమల్లితోట జంక్షన్: అమెరికాలో దేశ క్రీడ బేస్‌బాల్ మన దేశంలోనూ ఆదరణ పొందుతోంది. 1983లో మనదేశంలో ప్రారంభమైన ఈ క్రీడను మొదటిసారిగా 1985లో జాతీయ క్రీడలో చేర్చారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1987లో బేస్‌బాల్ ఫెడరేషన్ ప్రారంభించే స్థాయికి ఎదిగింది. ఫిట్‌నెస్, వేగం అవసరమైన ఈ క్రీడలో ప్రభుత్వ పాఠశాల క్రీడాకారులు రాణించి పోలీస్, ఎయిర్ ఫోర్స్, సచివాలయ ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో సుమారు 700 మంది వివిధ ప్రాంతాల్లో ఈ క్రీడలో శిక్షణ పొందుతున్నారు. 2008 వరకు అండర్-19 పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో బాలురు, బాలికలకు జిల్లా, రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించేవారు. అనంతరం అండర్-14, 17 బాలురు, బాలికల కేటగిరీలను చేర్చారు.

దీంతో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో పాలగుమ్మి, రావులపాలెం, పొనమండ, రాజమహేంద్రవరం, గొల్లపాలెం, పెద్దారప్పాడు ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాల్లో విద్యార్థులకు కోచ్ ప్రసాద్ ఆధ్వర్యంలో శిక్షణ ఇస్తున్నారు. కోవిడ్ కాలానికి ముందు 2008 నుంచి 2018మ వరకు సబ్‌జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో అండర్-14, 17 లో రాష్ట్రస్థాయిలో ఏదో ఒక స్థానంలో తూర్పు క్రీడాకారులు తమ సత్తా చాటారు. ప్రస్తుతం స్థానిక పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరుగుతున్న 66వ పాఠశాల క్రీడా సమాఖ్య అండర్-14, 17 బేస్‌బాల్ పోటీల్లో పాల్గొంటున్న ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా క్రీడాకారులు తమ ప్రతిభ చూపుతూ వారి అభిప్రాయాలను సాక్షితో పంచుకున్నారు.

ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది



సీఎం జగన్ ప్రభుత్వం పాఠశాల స్థాయి క్రీడలకు పెద్దపీట వేసింది. నాడు-నేడులో భాగంగా పాఠశాలల్లో క్రీడా మైదానాలు అభివృద్ధి చేస్తోంది. హైస్కూళ్లలో వ్యాయామ ఉపాధ్యాయుల నియామకం వల్ల, వారికి బేస్‌బాల్‌పై అభిరుచి ఉండడం వల్ల ఆయా పాఠశాలలో ఉదయం, సాయంత్రం ఈ క్రీడలో శిక్షణ ఇస్తున్నాం.

- ప్రసాద్, బేస్‌బాల్ కోచ్

రాష్ట్రస్థాయిలో ఇదే తొలిసారి



నా పేరు కె.మోహన్ సాయి మణికంఠ. పొనమండ ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాను. బేస్‌బాల్ అంటే ఇష్టం. రాష్ట్ర స్థాయి పోటీల్లో తొలిసారి పాల్గొంటున్నా. బాలుర విభాగంలో అండర్-14 జట్టు ముందంజలో ఉండడం ఆనందంగా ఉంది.

5వ తరగతి నుంచి నేర్చుకుంటున్నాను



నా పేరు డి.సూర్యవెంకట మణికంఠ. పెద్దారప్పాడు స్కూల్‌లో 7వ తరగతి చదువుతున్నా. 5వ తరగతి నుంచి ఈ క్రీడలో శిక్షణ పొందుతున్నా. కోవిడ్ వల్ల రెండేళ్లుగా క్రీడలకు దూరంగా ఉన్నాం. ఈ ఏడాది పోటీలు జరగడం సంతోషంగా ఉంది. జాతీయస్థాయిలో రాణించడం నా ఆశయం.

ప్రభుత్వ ఉద్యోగం సాధించాలి



నా పేరు కె.సాకేత్‌కన్నా. పెద్దాద్దాడు ప్రభుత్వ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నా. రెండేళ్లుగా బేస్‌బాల్‌లో శిక్షణ పొందుతున్నాను. బేస్‌బాల్‌లో రాణించి పోలీస్ ఉద్యోగం సాధించడం నా లక్ష్యం.